# సాక్షి
## అన్నమయ్య జిల్లా

శనివారం । 4 । మార్చి । 2023






### పరీక్షల వేళ.. ప్రశాంతంగా సాగుదాం

ఆహార నియమాలు పాటించడంతో పాటు ఒత్తిడిని అధిగమిస్తే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. -IIలో



### ఎర్రచందనం స్వాధీనం

రూ.22 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఓ నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్‌ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.180 | రూ.240 |
| రెండోరకం | రూ.100 | రూ.178 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 166 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### 6న అరుణాచలంకు ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ: పౌర్ణమి పురస్కరించుకుని అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ 2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండు నుంచి ఉదయం 9.45 గంటలు అల్ట్రా డీలక్స్ బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానుపోను చార్జీలు రూ.790 చెల్లించాలన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

### 6న అత్తిరాలలో గిరిప్రదక్షిణ

రాజంపేట రూరల్: ప్రముఖ శైవ పుణ్య క్షేత్రమైన అత్తిరాలలో ఈ నెల 6న సాయంత్రం 6 గంటలకు త్రేతేశ్వరస్వామి గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గిరిప్రదక్షిణ భక్త మండలి కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిప్రదక్షణలో పాల్గొనదలిచిన భక్తులు సాయంత్రం 5.30 గంటలకు అత్తిరాలకు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా త్రేతేశ్వర స్వామికి పల్లకిసేవ నిర్వహించనున్నట్లు చెప్పారు.

### అప్రమత్తతతోనే వ్యాధులు దూరం



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

రాయచోటి అర్బన్: ప్రజలు నిత్యం అప్రమత్తంగా మెలగడం ద్వారానే వ్యాధుల బారినపడకుండా ఉండొచ్చని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.కొండయ్య అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని కొత్తపల్లె అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్‌తో కలసి పర్యటించారు. వీధులలో తిరుగుతూ మురుగునీటి కాలువలను పరిశీలించారు. ప్రతిఒక్కరికీ పరిశుభ్రత, దోమలవ్యాప్తి, నివారణ, ప్రతి శుక్రవారం నిర్వహించాల్సిన డ్రైడే తదితరాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వైద్యుడు శివకుమార్‌సాయికి సూచనలు చేశారు. అనంతరం అర్బన్ పీహెచ్‌సీని సందర్శించారు.రికార్డులను పరిశీలించారు.కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ డి.వెంకటేశ్వరరెడ్డి, ఆశా వర్కర్‌లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

కడప అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయంతోనే అధిక లాభాలు పొందొచ్చని ప్రకృతి వ్యవసాయం రాయలసీమ రీజియన్ సమన్వయకర్త చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయంలో డీపీఎం రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో సిబ్బందికి రెండోరోజు విత్తన గుళికలు, పీఎండీఎస్ పంటలసాగుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన గుళికల ప్రాముఖ్యత, చిరుధాన్యాల సాగుతో భూమిని 365 రోజులు కప్పి ఉంచే ప్రక్రియని తమ యూనిట్ పరిధిలోని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పీఎండీఎస్ సాగుకు కావాల్సిన 30 రకాల విత్తనాల సీడ్ కిట్స్‌ను తయారు చేసుకుని రైతులకు అందబాటులో ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. ఈ విధంగా పంటలను సాగు చేయడం వలన భూసారం పెరిగి అధిక దిగుబడులు రావటానికి ఆస్కారం ఉంటుందని అన్నారు.

# వడివడిగా అడుగులు!

- శరవేగంగా సాగుతోన్న సెంచురీ ఫైబోర్డ్స్ పనులు
- నిర్ణీత గడువు కంటే ఏడాది ముందుగా ఉత్పత్తులు
- 2024 డిసెంబర్ నాటి రెండు దశల పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- 2023 డిసెంబర్ నాటికే పూర్తి చేసే దిశగా యాజమాన్యం చర్యలు
- రూ.45కోట్లుతో బ్రహ్మంసాగర్ నుంచి నీటి సరఫరా పనులు



నిర్మాణంలో సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ పనులు

సాక్షి ప్రతినిధి, కడప: పారిశ్రామిక ప్రగతి సాధించాలనే కృతనిశ్చయంతో రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తోంది. అందుకు తగిన ప్రణాళికలు రచిస్తూ, పెట్టుబడులను ఆహ్వానిస్తోంది. పారిశ్రామికవేత్తలకు అనువైన మౌలిక సదుపాయాల కల్పనలో వేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. వెరసి నిర్ణీత గడువు కంటే ముందే ఉత్పత్తులు ప్రారంభించే దిశగా పారిశ్రామికవేత్తలు వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలో జిల్లాలో సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ నిర్మాణ పనులు శరవేగంగా రూపుదిద్దుకుంటున్నాయి.

వైఎస్సార్ జిల్లా బద్వేల్ సమీపంలోని నెల్లూరు రహదారిలో గోపవరం వద్ద ఏర్పాటవుతున్న సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.956 కోట్లతో చేపట్టే ఈ పరిశ్రమ నిర్మాణానికి 2021 డిసెంబరు 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. వెంటనే పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాల పట్ల దృష్టి సారించారు. నీటి కేటాయింపులు, విద్యుత్ సరఫరా అనుమతులు దక్కాయి. ఫైబోర్డ్స్ పరిశ్రమకు బ్రహ్మంసాగర్ నుండి 0.07 టీఎంసీల నీరు సరఫరాకు అవసరమైన పనులు రూ.45 కోట్లతో చేపట్టారు. 41. 8 కిలోమీటర్లు నిర్మాణ పనులకు 9 నెలలు గడువు విధించగా, 6నెలల్లోనే పనులు పూర్తి చేస్తున్నారు. అదేవిధంగా 132 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణం కోసం ఇప్పటికే ఏపీఐఐసీ ట్రాన్స్‌కోకు రూ.19.1 కోట్లు చెల్లించింది. ఈ మేరకు విద్యుత్ లైన్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. ప్రభుత్వానికి సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ నిర్మాణం పట్ల ఉన్న చిత్తశుద్ధి ఆ పనుల వేగం స్పష్టం చేస్తోందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించిన భూమి: 589.23 ఎకరాలు

ప్రాజెక్టు వ్యయం: రూ.956 కోట్లు

ప్రత్యక్షంగా, పరోక్షంగా లభించనున్న ఉద్యోగాలు: 6662

ప్రతిరోజు వినియోగించనున్న కర్ర: 2000 టన్నులు

**నిర్ణీత గడువు కంటే ముందే ఉత్పత్తులు...**

గోపవరం మండలంలో 589.23 ఎకరాలల్లో రూ.956 కోట్లతో సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ ఏర్పాటుకు ఆ సంస్థ యాజమాన్యం శ్రీకారం చుట్టింది. ఇప్పుడా ఆ పెట్టుబడులు రూ.1600 కోట్లుకు చేరనున్నాయి. 2024 డిసెంబర్ నాటికి ఉత్పత్తి లక్ష్యం కాగా 2023 డిసెంబర్ నాటి రెండు దశల పనులు కూడా పూర్తి కానున్నాయి. ఏప్రిల్ నాటికే తొలిదశ పనులు పూర్తి చేసి ఉత్పత్తులు ప్రారంభించేందుకు యాజమాన్యం కృతనిశ్చయంతో ఉంది. అదే విషయాన్ని శుక్రవారం విశాఖపట్నం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో సంస్థ చైర్మన్ సజ్జన్ భజాంకా స్పష్టం చేశారు. ఈపనులు పూర్తి అయితే ప్రతిరోజు 2000 టన్నుల కర్రను వినియోగించనున్నారు. రెండవదశ తర్వాత రోజుకు 4000టన్నుల కర్ర పరిశ్రమకు అవసరమవుతుంది. ఈ మేరకు సుబాబుల్, జామాయిల్, సర్వి కర్రకు పూర్తి డిమాండ్ ఏర్పడనుంది. రైతులు సైతం తగిన రీతిలో సాగుకు సిద్ధపడ్డారు.

**2662 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు...**

సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ పనులు పూర్తయితే ప్రత్యక్షంగా 2662 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. అందులో 75శాతం స్థానికులకే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే దాదాపు 2వేల మంది జిల్లాకు చెందిన వారికి ఉద్యోగాలు దక్కనున్నాయి. ఆమేరకు ఆ సంస్థ చైర్మన్ సజ్జన్ భజాంకా స్పష్టం చేశారు. స్కిల్స్ లేకున్నా సరే ఉద్యోగులుగా స్థానికులను ఎంపిక చేసుకొని వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పరోక్షంగా మరో 4వేల మందికి ఉపాధి లభించనున్నట్లు స్పష్టీకరించడం విశేషం. జిల్లాలో మరీ ముఖ్యంగా బద్వేల్ ప్రాంతంలో నిరుద్యోగులకు సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ ఎంతో ఉపయోగకరంగా నిలవనుంది.

**ఏప్రిల్ నాటికి తొలిదశ పనులు పూర్తి**



సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమ పనులు అత్యంత వేగంగా సాగుతున్నాయి. తొలిదశ పనులు ఏప్రిల్‌కు పూర్తి చేయనున్నాం. వెంటనే ఉత్పత్తులు కూడా చేపట్టనున్నాం. రెండోదశ పనులు కూడా నిర్ణీత గడవు కంటే ఏడాదికి ముందే 2023 డిసెంబర్ నాటికి పూర్తి చేయనున్నాం.

– రమేష్‌కుమార్‌రెడ్డి, జీఎం, సెంచురీ ఫెలైబోర్డ్స్

**అత్యంత ప్రాధాన్యతతో చేపడుతున్నాం**



సెంచురీ ఫైబోర్డ్స్ పరిశ్రమకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రాధాన్యత ఇస్తున్నాం. రూ.45కోట్లతో నీటి సరఫరా పనులు చేస్తున్నాం. 9 నెలలు గడువు విధించగా 6 నెలల్లో పనులు పూర్తి చేస్తున్నాం. యాజమాన్యం సైతం అదే కృతనిశ్చయంతో పరిశ్రమ పనులు వేగంగా చేపడుతోంది.

– శ్రీనివాసమూర్తి, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ

### ఉగాది రోజున గృహప్రవేశాలు నిర్వహించాలి

- జిల్లా హౌసింగ్ పీడీ శివయ్య

గుర్రంకొండ: ఉగాది పండుగ రోజున జగనన్న కాలనీల్లో వైఎస్సార్ ఇళ్ల గృహ ప్రవేశాలు ఉత్సవంలా నిర్వహించాలని జిల్లా హౌసింగ్ పీడీ శివయ్య అన్నారు. శుక్రవారం గుర్రంకొండలో జగనన్న లేఅవుట్‌లో ఆయన పర్యటించారు. కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామానికి సమీపంలో మరో జగనన్న కాలనీకి ఇటీవల సేకరించిన 8.38 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. తుది దశకు చేరుకున్న ఇళ్ల లబ్ధిదారులకు అవసరమైతే రూ. 50 వేలు అదనపు రుణాలు బ్యాంకు ద్వారా ఇప్పించాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. ఇందుకోసం పట్టణాల్లో మెప్మా, రూరల్ ప్రాంతాల్లో వెలుగు సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. త్వరలోనే ఈవిషయమై లబ్ధిదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం ఇక్కడున్న జగనన్న లేఅవుట్ ఎల్–1,2.3లలో 284 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, వీరిలో చాలా మంది ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు చేసుకొంటున్నారని అన్నారు. ఈలేఅవుట్‌లో ఇంకా పట్టాలు మంజూరు చేయని ఇళ్ల స్థలాలు 132 వరకు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రమోహన్, మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, ఇన్‌ఛార్జ్ హౌసింగ్ ఏఈ ఆంజినేయులు, వీఆర్వో అన్వర్, సచివాలయ హౌసింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



గుర్రంకొండలో జగనన్నలేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న జిల్లా హౌసింగ్ పీడీ శివయ్య

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాల బారినపడకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాల బ్లాక్‌స్పాట్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, కల్వర్టులు, రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పవడం జరుగుతోందని ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని చెప్పారు.

**బ్యానర్ ఆవిష్కరణ**

రోడ్డు ప్రమాదం గురించి సమాచారం ఫోన్ ద్వారా పోలీసులకు లేదా అత్యవసర సర్వీసులకు తెలియజేసినా, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని గుర్తించి గంటలోపు హాస్పిటల్‌లో చేర్పించిన గుడ్ సమారిటన్‌లకు నగదు బహుమతి రూ.5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారిణి శాంతకుమారి, ఆర్టీసీ, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులు, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖాధికారులు పాల్గొన్నారు.

### వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

రాజంపేట: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అటవీ అధికారి వివేక్ అన్నారు. శుక్రవారం డీఎఫ్‌ఓ కార్యాలయంలోని సమావేశం భవనంలో ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవులపై విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. అటవీ సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేస్తే అది పర్యావరణాన్ని పరిరక్షిస్తుందన్నారు. అడవికి నిప్పు పెట్టడం మానవాళికి ముప్పు అనేది గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 21 మంది విద్యార్థులకు బహుమతులను డీఎఫ్‌ఓ చేతుల మీదుగా అందచేశారు.



విజేతలకు ప్రశంసపత్రాలు, బహుమతులను అందచేస్తున్న జిల్లా అటవీ అధికారి వివేక్

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

- 20 చెక్‌పోస్టుల ద్వారా వాహనాల తనిఖీలు
- రూ. 35 లక్షలు స్వాధీనం
- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రాయచోటి: ఉపాధ్యాయులు, పట్టభద్రుల (ఎమ్మెల్సీ) ఎన్నికలు సందర్భంగా అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్దన్ రాజు ఆదేశాలతో జిల్లాలో పోలీసులు నిఘాను పెంచారు. ఎన్నికల్లో అక్రమాలకు చెక్ పెట్టేలా జిల్లాలో 20 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అనుమానం వచ్చిన వాహనాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. రాజంపేటలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో రాజంపేట అర్బన్ సీఐ ఆధ్వర్యంలో జరిపిన తనిఖీలలో రెండు వాహనాల్లో ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 35 లక్షల నగదును, మన్నూరు సీఐ మరో రూ. 2.70 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు జిల్లాలో 709 లైసెన్సు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలి పారు. జిల్లాలోని మదనపల్లి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాలలో అక్రమ మద్యం, నాటుసారాను అరికట్టడంలో భాగంగా నాకాబందీ నిర్వహించారు. ఈ తనిఖీలలో మద్యం, నాటుసారా అక్రమ రవాణా విక్రయాలకు పాల్పడుతున్న వారిపై పోలీసులు, స్పెషల్ ఎక్సైజ్ బ్రాంచ్ అధికారులతో కలిసి సంయుక్తంగా 263 స్థావరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 160 కేసులు నమోదు చేసి, 130 మంది నిందితులను అరెస్టు చేశారు. వారినుంచి 913 లీటర్ల నాటుసారా, 2710 మద్యం ప్యాకెట్లు, 15 వాహనాలను స్వాధీనం చేసుకుని, 27500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలన్న ఉద్దేశంతో ఎన్నికల నియమావళి మొదలైనప్పటి నుండి నిఘాను పెంచి దాడులను చేపట్టినట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలియపరిచారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 1119 మందిని మండల తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఎన్నికల సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

# ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ

- పోలింగ్ స్టేషన్ల పరిశీలన పూర్తి
- తుది ఓటరు జాబితా సిద్ధం
- జోరుగా అభ్యర్థుల ప్రచారం

బద్వేలు/వేంపల్లె: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ ఈ నెల 13వ తేదీ జరగనుంది. మరో తొమ్మిది రోజుల గడువు ఉన్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. నాలుగు రోజుల కిందట తుది ఓటరు జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇప్పటికే పోలింగ్‌స్టేషన్ల పరిశీలన పూర్తి చేశారు. వసతుల కల్పనపై దృష్టి సారించారు. రెండు రోజుల కిందట ఓటర్ స్లిప్పులు సైతం తహసీల్దార్ కార్యాలయాలకు చేరాయి. వీటిని బూత్‌లెవెల్ అధికారులు ఓటర్ల ఇంటి వద్ద అందజేస్తున్నారు. ఈ ప్రక్రియను ఎనిమిదో తేదీ లోపు పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**జిల్లాలోనే అత్యధిక ఓటర్లు**

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీకి సంబంధించి అన్ని జిల్లాల కంటే వైఎస్సార్ జిల్లాలోనే అత్యధిక ఓటర్లు ఉండటం విశేషం. ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ రెండింటిలోనే ఇదే పరిస్థితి. ఓటు చైతన్యంతోనే అత్యధికులు నమోదు చేసుకున్నారని అధికారులు చెబుతున్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో గత ఎన్నికలల్లో దాదాపు 2.58 లక్షల మంది ఓటర్లు ఉంటే ప్రస్తుతం దాదాపు 80వేల మంది అధికంగా 3,30,124 మంది ఓటు హక్కును పొందారు. అదే విధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో 19 వేల మంది లోపే ఓటర్లు ఉండగా ప్రస్తుతం 9వేల మంది అధికంగా ఓటర్లు ఓటు హక్కును పొందారు.

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి 49, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 12 మంది పోటీ**

పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి 49 మంది , ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 12 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరికి ఇప్పటికే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గుర్తులు కేటాయించారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు, రిజిస్టర్డ్ జాతీయ,రాష్ట్ర రాజకీయ పార్టీలు, తర్వాత స్వతంత్ర అభ్యర్థులకు పేరులోని మొదట అంగ్ల అక్షరాన్ని బట్టి వరుస కేటాయించారు. దీని ప్రకారం భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి(టీడీపీ), రాఘవేంద్ర నగరూరు(బీజేపీ), వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ), ఎస్.మల్లికార్జునరెడ్డి (అఖిలభారత కిసాన్ జనతా పార్టీ)లకు మొదటి నాలుగు వరుస స్థానాలు మిగిలిన స్వతంత్ర్య అభ్యర్థులకు తదుపరి స్థానాలు కేటాయించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో అందరూ స్వతంత్ర అభ్యర్థులే కావడంతో అల్ఫాబెట్ అక్షరాల ప్రకారం వరుస కేటాయించారు. సమయం తక్కువ ఉండటంతో వీరంతా జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

**8వ తేదీలోపు ఓటరు స్లిప్పుల పంపిణీ**

ఓటర్లకు సంబంధించి ఓటరు స్లిప్పులు ఇప్పటికే ఆయా మండలాల రెవెన్యూ కార్యాలయాలకు చేరాయి. వీటిని బీఎల్‌ఓలు పట్టణాలు, గ్రామాల వారీగా వేరు చేసుకుని ఓటర్లకు అందజేస్తున్నారు. ఇందులో ఓటరు వివరాలతో పాటు పోలింగ్ స్టేషన్ అడ్రస్ కూడా ఉంటుంది. ఓటరుకు అందజేసిన తర్వాత రసీదుపైన వారితో సంతకం చేయించుకుంటున్నారు. ఓటింగ్‌కు ఐదు రోజుల ముందు అంటే ఈ నెల 8వ తేదీ లోపు వీటిని అందించాలని సూచించారు.

**అధికారుల కేటాయింపు**

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే పర్యవేక్షణ, ఎన్నికల కోడ్ వంటి అంశాలకు సంబంధించి పలువురు అధికారులకు విధులు కేటాయించారు. ఇందులో భాగంగా 36 టీంలను వీడియో సర్వైలెన్స్‌కు, 36 టీఎంలను ఫ్లయింగ్ స్క్వాడ్ బాధ్యతలను అప్పగించారు.వీరంతా ఇప్పటికే విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా పీఓ, ఏపీఓల విధులు కేటాయించి ఈ నెల ఒకటో తేదీన పోలింగ్ నిర్వహణపై మొదటి విడత శిక్షణ ఇచ్చారు.వీరికి రెండో విడత శిక్షణ ఆరో తేదీ జరగనుంది. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పోలింగ్ అధికారి, సహాయ పోలింగ్ అధికారి, ముగ్గురు ఇతర పోలింగ్ సిబ్బందిని నియమిస్తున్నారు. ఎన్నికల కోసం 21 మందిని సెక్టోరల్ అధికారులు, 21 మంది రూట్ అధికారులను నియమించారు.

**టీచర్స్ నుంచి పెరుగుతున్న మద్దతు**

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ఖాతాలో పడింది. ఈ నేపథ్యంలో టీచర్స్ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరపున ఎం.వి.రామచంద్రారెడ్డికి అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. 33 ఉపాధ్యాయ సంఘాల మద్దతు పలకడం, ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా కలిసి రావడం శుభపరిణామంగా విశ్లేషకులు చెబుతున్నారు. అటు అనుబంధ ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కత్తి నరసింహారెడ్డిలు బరిలో ఉన్నారు. గతంలో కత్తి నరసింహారెడ్డి విజయం సాధించినా వారి వల్ల ఉపాధ్యాయులకు కలిగిన ప్రయోజనాలు ఒక్కటీ కూడా లేవు. ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే తమ సమస్యలు పరిష్కరిస్తారన్న నమ్మకం ఉపాధ్యాయుల్లో ఉంది. రామచంద్రారెడ్డి ఇప్పటికే ప్రైవేట్ యాజమాన్య సంఘం అపూస్మ రాష్ట్ర అధ్యక్షునిగా సేవలు అందించిన గుర్తింపు ఉంది. దీంతో ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ఇస్తున్నాయి. తాజాగా రెండు పీఈటీ సంఘాలు మద్దతు ప్రకటించాయి.. దీంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి.రామచంద్రారెడ్డి తెలుపు తథ్యమని విశ్లేషకులు చెబుతున్నారు.



పోరుమామిళ్లలో ఓటరు జాబితా, స్లిప్పులను సరి చూసుకుంటున్న బీఎల్‌ఓలు

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వివరాలు**

| జిల్లా | పోలింగ్ కేంద్రాలు | మొత్తం ఓటర్లు | పురుషులు | మహిళలు | థర్డ్ జెండర్ |
|---|---|---|---|---|---|
| వైఎస్సార్ | 36 | 7,461 | 4,390 | 3,071 | 0 |
| అన్నమయ్య | 15 | 1,958 | 1,326 | 632 | 0 |
| అనంతపురం | 33 | 5,564 | 3,459 | 2,104 | 1 |
| శ్రీసత్యసాయి | 32 | 3,348 | 2,277 | 1,071 | 0 |
| కర్నూలు | 25 | 5,391 | 2,989 | 2,402 | 0 |
| నంద్యాల | 30 | 4,426 | 2,806 | 1,619 | 1 |
| మొత్తం | 173 | 28,148 | 17,247 | 10,899 | 2 |
| **గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వివరాలు** | | | | | |
| వైఎస్సార్ | 86 | 81,317 | 52,245 | 29,063 | 8 |
| అన్నమయ్య | 21 | 20,594 | 14,014 | 6,574 | 6 |
| అనంతపురం | 77 | 68,341 | 45,659 | 22,672 | 10 |
| శ్రీసత్యసాయి | 52 | 43,310 | 29,686 | 13,620 | 4 |
| కర్నూలు | 66 | 61,633 | 42,040 | 19,592 | 1 |
| నంద్యాల | 56 | 54,929 | 38,695 | 16,230 | 4 |
| మొత్తం | 358 | 3,30,124 | 17,247 | 10,899 | 33 |

### హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు తప్పనిసరి

- జిల్లా రవాణా శాఖాధికారి శాంతకుమారి

రాయచోటి :వాహనచోదకులందరూ ఇకపై తప్పనిసరిగా హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ (హెచ్‌ఎస్‌ఆర్‌పీ) నంబర్ ప్లేట్లు వాడాలని జిల్లా రవాణా శాఖాధికారి శాంతకుమారి చెప్పారు. ఎన్నో ఉపయోగాలతో కూడిన ఈ ప్లేట్ వినియోగంపై ఇప్పటికే రవాణాశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేసినట్లు శుక్రవారం చెప్పారు. క్యాబ్, ఆటో, టాక్సీ వంటి వాహనాలు ఏటా రెన్యువల్‌కు వచ్చే సమయంలో పాత నంబర్ ప్లేట్స్ మార్చి హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేట్లు అమరుస్తారన్నారు. 2014 కొత్తగా తీసుకున్న వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పీలనే రవాణాశాఖ తప్పని సరి చేసిందన్నారు. సెకండ్‌హ్యాండ్ వెహికల్స్‌కు కూడా ఫీజు కట్టి నంబర్ ప్లేట్లు బిగించాలనే షరతులను ప్రభుత్వం విధించిందని తెలిపారు. షోరూంలలో రిజిస్ట్రేషన్ అవుతన్న వాహనాలన్నిటికీ అక్కడే ప్లేట్సు అందజేస్తారన్నారు. నంబర్ ప్లేట్స్ పొందేందుకు ఏపీఆర్‌టీఏసీటీజెన్ డాట్ ఈ ప్రగతి డాట్ ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో వాహన రిజిస్ట్రేషన్ సంఖ్యను నమోదు చేసి శ్లాట్ తీసుకొని నంబర్ ప్లేట్ పొందవచ్చుని పేర్కొన్నారు.

**ఇకపై గందరగోళం ఉండదు**

బైకులు, కార్లపై వెళ్లే వారు నంబర్ వివిధ డిజైన్లలలో తీర్చి దిద్దుతారు. అసలు నంబర్ మాత్రం ఎంత చూసినా పోల్చుకోలేని పరిస్థితి ఉంటుందన్నారు. ప్రమాదం జరిగినా, దొంగతనం జరిగినా నంబర్‌ను చూసి కనిపెట్టాలంటే సాధ్యం అయ్యేది కాదన్నారు. అలాంటి గందరగోళ పరిస్థితుల నుంచి బయటపడి నేరాలను తగ్గించాలన్న సదుద్దేశంతో కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ ఆదేశాలతో హెచ్‌ఎస్ఆర్ ప్లేట్స్‌ను తప్పని సరిగా వాడాలని రాష్ట్ర రవాణ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### మామిడి తోటలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**పెద్దతిప్పసముద్రం :** మండలంలోని మల్లెల సమీపంలో వెంకటరెడ్డి అనే రైతుకు చెందిన మామిడి తోటలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న ములకలచెరువు ఫైర్ సిబ్బంది గణేష్ కుమార్, సుధాకర్‌రెడ్డి, మనోజ్ కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ.1.70 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఫైర్ సిబ్బంది శుక్రవారం పేర్కొన్నారు.

### వాహనం ఢీకొని జింక మృతి



**పెద్దతిప్పసముద్రం :** పీటీఎం–బి.కొత్తకోట రోడ్డులోని జోగివల్లి వద్ద శుక్రవారం ఉదయం రోడ్డు దాటుతున్న జింకను ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో జింక అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ బురకాయలకోట సెక్షన్ అధికారి మోహన్ ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన జింకను పరిశీలించారు. ములకలచెరువులో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కట్టెలతో కాల్చి వేశారు.

### బాలిక ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె :** కుటుంబ సభ్యులు మందలించారని మనస్తాపం చెంది ఓ బాలిక పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన బాలిక(14) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. చదువుపై నిర్లక్ష్యం చూపుతుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన బాలిక గురువారం రాత్రి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### గాయపడిన వృద్ధుడి మృతి

**మదనపల్లె :** రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు శుక్రవారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందాడు. మండలంలోని అంకిశెట్టిపల్లెకు చెందిన మదార్ సాబ్(70) భవన నిర్మాణ మేస్త్రీగా పని చేస్తుండేవాడు. వారం రోజుల క్రితం వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో చీకలబైలుకు వెళుతుండగా, దారిలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో వృద్ధుడు తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఇక్కడి వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

# పరీక్షల వేళ.. ప్రశాంతంగా సాగుదాం

- ఈనెల 15 నుంచి ఇంటర్..
- ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు
- ఆహార నియమాలు పాటించడం ముఖ్యం

**మదనపల్లె సిటీ :** పరీక్షా కాలం వచ్చేసింది. మార్చి 15 నుంచి ఇంటర్మీడియట్, ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి.ఈ క్రమంలో ఆహార నియమాలు పాటించడంతో పాటు ఒత్తిడిని అధిగమిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. పబ్లిక్ పరీక్షలు త్వరలో ప్రారంభం కానున్న కీలక సమయంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే ఏడాది కష్టమంతా వృథా అయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే సిలబస్‌ను పూర్తి చేసి ఉపాధ్యాయులు విద్యార్థులతో పునశ్చరణ చేయిస్తున్నారు. విద్యార్థులకు వివిధ పరీక్షల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా గ్రేడుల వారీ గా విడదీసి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు.



పదో తరగతి విద్యార్థులు

### సమయానికి భోజనం, నిద్ర అవసరం



పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతుంటారు. మానసిక ఒత్తిడి వల్ల మొదటగా తలనొప్పి, ఆకలి లేకపోవటం, చికాకు, ఇంట్లో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై ప్రతి చిన్న విషయానికి విసుగు చెందడం చేస్తుంటారు. శారీక సమస్యల విషయానికొస్తే భోజనం చేయకపోవటం, పౌష్టికాహారం తీసుకోకపోవటం వల్ల రక్తహీనత బారిన పడతారు. దీని నివారణకు తల్లిదండ్రులు పిల్లలు బాగా చదువుతున్నారా అని అడగటం కంటే సమయానికి నిద్ర, భోజనం తీసుకుంటున్నారా లేదా చూసుకోవాలి. వీలైనంత ఎక్కువగా మంచి నీరు తాగుతుండాలి. 10 నుంచి 14 గ్లాసులు మంచినీరు రోజూ తీసుకోవాలి. పరీక్షల సమయంలో ఎక్కువగా మాంసాహారం జోలికి పోకూడదు. రాత్రి సమయంలో అల్పాహారం తీసుకోవటంతో పాటు పండ్లు తినడం వల్ల హుషారుగా ఉండేందుకు వీలుంటుంది. పిల్లల ప్రతి అడుగులో ధైర్యం చెప్పాలి.

– కె.వి.సరస్వతమ్మ, సీనియర్ వైద్యులు,జిల్లా ఆస్పత్రి, మదనపల్లె.

### నిత్యం వ్యాయామం చేయాలి



ఎప్పుడూ చదువుతూ ఉండటం వల్ల ఒత్తిడికి గురికావడం, అలసట వస్తుంది. దీంతో పరీక్షల సమయంలో ఇబ్బంది కర పరిస్థితి ఏర్పడుతోంది. విద్యార్థులు నిత్యం తప్పనిసరిగా వ్యాయామం, యోగా చేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుంది. కారం, మసాలాలు ఉన్న పదార్థాలు ఏ మాత్రం తీసుకోరాదు. ఉదయం రాగి జావ తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. ముఖ్యంగా పరిశుభ్రత పాటించాలి.

– దేవకమ్మ, పీడీ, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె.

### పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి



పరీక్షల తేదీలు ముందే తెలుసు కనుక ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి. ఉదయం వేళల్లో ఎక్కువగా చదివేందుకు ప్రయత్నించాలి. మార్కుల కోసం పిల్లల్ని తల్లిదండ్రులు ఒత్తిడి చేయకూడదు. వారితో ప్రేమగా మాట్లాడాలి. పరీక్షల సమయంలో కనీసం 6 నుంచి 8 గంటలు విద్యార్థులు రోజూ పడుకోవాలి. సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలి. వారికి ప్రశాంతమైన వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలి. వారితో ఎక్కువ సమయం గడపాలి. మధ్యలో చిన్నపాటి విషయాలు, ఆసక్తికర అంశాలు చెబుతూ చదువుకు కాస్త విరామం ఇస్తుండాలి.

– డాక్టర్ రాధిక, సైకియాట్రిస్టు, జిల్లా ఆస్పత్రి, మదనపల్లె

## గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

**మదనపల్లె :** మండలంలోని కోళ్లబైలు పంచాయతీ వాటర్‌ఫాల్స్ సమీపంలో కుళ్లిన ఓ గుర్తుతెలియని యువకుడి మృతదేహం వెలుగుచూసింది. శుక్రవారం వాటర్‌ఫాల్స్‌కు వెళ్లిన కొందరు గ్రామస్తులకు సమీపంలో దుర్వాసన వస్తుండటంతో.. అనుమానంతో వెళ్లి చూడగా కుళ్లిపోయి దుర్భరస్థితిలో ఉన్నటువంటి ఓ యువకుడి మృతదేహం కనిపించింది. దీంతో తాలూకా పోలీసులకు సమాచారం అందించగా, ఎస్ఐ చంద్రశేఖర్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడిని 25 ఏళ్ల యువకుడిగా గుర్తించి, పరిసర ప్రాంతాల్లో ఆనవాళ్లు ఏమైనా దొరుకుతాయనే అనుమానంతో గాలించారు. మృతుడి కాళ్లకు చెప్పులు ఉండటం, దుస్తులు, శరీరం కాలి ఉండటంతో ఎవరైనా హత్య చేసి ఇక్కడకు తీసుకువచ్చి పెట్రోల్ పోసి కాల్చి వేశారా..? లేక యువకుడు ఆత్మహత్య చేసుకునే క్రమంలో పెట్రోల్ పోసుకుని శరీరాన్ని కాల్చుకున్నాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామస్తులను విచారణ చేస్తే కొద్ది రోజుల ముందు ఓ యువతి కోసం కొంత మంది యువకులు వాటర్‌ఫాల్స్ వద్ద గొడవ పడినట్లు చెప్పారు. అలాగే వాటర్‌ఫాల్స్‌కు తరచూ ఆకతాయి మూకలు రావడం, గొడవలు పడటం జరుగుతున్నాయని, ఈక్రమంలో ఎవరైనా యువకుడిని హతమార్చి ఉంటారేమోననే అనుమానాలు వ్యక్తం చేశారు. మృతదేహం ఘటనా స్థలం నుంచి కదిలించలేని స్థితిలో ఉండటంతో శనివారం అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కేసు విచారణ కొనసాగిస్తామని ఎస్ఐ తెలిపారు.

## మద్యం కేసుల్లో ముగ్గురు మహిళల అరెస్ట్

**బి.కొత్తకోట :** కర్ణాటక మద్యం విక్రయిస్తున్న కేంద్రాలపై నిర్వహించిన దాడుల్లో ముగ్గురు మహిళలను వేర్వేరు ప్రాంతాల్లో అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని మదనపల్లె ఇన్‌చార్జి ఎస్ఈబీ సీఐ పి.శ్రీహరిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు... బి.కొత్తకోట నగర పంచాయతీలో మద్యం విక్రయిస్తున్న ఎస్.సుబ్బమ్మ (50) నుంచి 20 ప్యాకెట్లు, మండలంలోని కాండ్లమడుగులో లక్ష్మీదేవమ్మ (43) నుంచి 57 మద్యం ప్యాకెట్లు, కాండ్లమడుగు క్రాస్‌లో శంకరమ్మ (45) నుంచి 90 బాటిళ్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు. శుక్రవారం కోర్టుకు హాజరుపర్చగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ దాడుల్లో ఎస్ఐ అంజద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

**నాటుసారా స్వాధీనం**

**ములకలచెరువు :** నాటు సారా అక్రమంగా విక్రయిస్తున్న ఒక మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక శుక్రవారం తెలిపారు. సీఐ కథనం మేరకు... సర్కిల్ పరిధిలోని పెద్దమండ్యం మండలం వెలిగల్లు క్రాస్ వద్ద నాటుసారా విక్రయిస్తుండగా ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించి ఒక మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను పీలేరు మండలం రామానాయక్ తండాకు చెందిన బి.లక్ష్మీదేవి(40)గా గుర్తించారు. ఆమె నుంచి 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

**సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్**

**మదనపల్లె :** సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసి, ఆమె వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని నిమ్మనపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న రెడ్డెమ్మ, ఆమె కుమారుడు గౌతమ్ గత కొద్ది రోజులుగా ఇంట్లోనే సారా విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం అందడంతో.. శుక్రవారం టూటౌన్ ఎస్ఐ చంద్రమోహన్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, నిందితురాలు రెడ్డెమ్మపై కేసు నమోదు చేశారు.



ములకలచెరువు : నిందితురాలి అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

## మోసపోయాం.. మా డబ్బులు ఇప్పించండి సారూ..

– కలెక్టర్ ముందు మొరపెట్టుకున్న బాధితులు

**గాలివీడు :** ఇళ్ల స్థలాల పట్టాలు ఇప్పిస్తానంటూ మాయమాటలు చెప్పి వసూళ్లకు పాల్పడిన వీఆర్ఏ కోలా రమణ వద్ద నుంచి తమ సొమ్మును ఇప్పించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ముందు బాధితులు వాపోయారు. శుక్రవారం గాలివీడు టౌన్ శెట్టివారిపల్లెకు చెందిన గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ గిరీషా పీఎస్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. లక్షల రూపాయలు వసూళ్లు చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ సదరు వీఆర్ఏను విధుల నుంచి తొలగించి క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. వెంటనే బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని గాలివీడు తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ విషయంపై సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు బాధితుల పక్షాన కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. న్యాయం జరిగే వరకు బాధితుల పక్షాన అండగా ఉంటామని ఆయన తెలిపారు.



కలెక్టర్ ముందు తమ బాధను విన్నవించుకుంటున్న బాధితులు

## ఉద్యోగం ఇప్పించిన వ్యక్తి ఖాతానే ఖాళీ

బ్యాంక్ మెసెంజర్ నిర్వాకం

**ఒంటిమిట్ట :** భారతీయ స్టేట్ బ్యాంకులో మెసెంజర్‌గా ఉద్యోగం ఇప్పించిన వ్యక్తి ఖాతానే ఖాళీ చేశాడు ఓ ఘనుడు. ఒంటిమిట్ట భారతీయ స్టేట్ బ్యాంక్‌లో జరిగిన నగదు గోల్‌మాల్ గురించి తెలిసిందే. ఈ కేసుపై మొత్తం విచారణ పూర్తి కావడంతో శుక్రవారం స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో డీఎస్పీ వెంకట శివారెడ్డి వివరాలు వెల్లడించారు. రెడ్డయ్య నాయుడు ఒంటిమిట్టలో ఎంపీడీవోగా పని చేసే సమయంలో కాకి లక్ష్మీనారాయణ తాను పేద వ్యక్తిని ఉద్యోగం ఇప్పించాలని కోరాడు. తనకు ఉన్న పరిచయాలతో ఒంటిమిట్ట ఎస్‌బీఐ మేనేజర్‌కు తెలిపి 2014లో మెసెంజర్‌గా ఉద్యోగం ఇప్పించారు. ఎస్‌బీఐలో తన ఖాతాలో ఉన్న నగదు మొత్తాన్ని స్వాహా చేసినట్లు రెడ్డయ్య నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. రెడ్డయ్య నాయుడు బ్యాంకు ఖాతాకు లబ్ధిదారుల మొబైల్ నంబర్ కాకుండా లక్ష్మీనారాయణ మొబైల్ నంబర్‌ను లింకు చేసుకుని, బ్యాంకు ఖాతా నుంచి నగదును పంపించుకోవడం జరిగింది. అలాగే మండలంలోని సాలాబాద్ గ్రామానికి చెందిన పేరూరు లక్ష్మీ బ్యాంకు ఖాతాకు, కోనరాజుపల్లి గ్రామానికి చెందిన శివకుమారి బ్యాంకు ఖాతాకు లక్ష్మీనారాయణ మొబైల్ నంబర్‌ను లింకు చేశాడు. పేరూరు లక్ష్మీ ఖాతా నుంచి రూ. 8.5 లక్షలు, శివకుమారి బాంకు ఖాతా నుంచి 7 లక్షలను తన అవసరాల కోసం, జల్సాలకు, అప్పులకు, క్రికెట్ బెట్టింగ్‌లకు ఉపయోగించాడు. తన మిత్రుడైన ఫైనాన్స్ వ్యాపారి మన్నేరు హరికృష్ణకు రూ.12 లక్షల నగదును పంపించాడు. మిగిలిన మొత్తాన్ని వన్ యాప్ క్రికెట్ బెట్టింగ్ ద్వారా అధిక మొత్తంలో నగదును సంపాదించాలనే ఉద్దేశంతో బెట్టింగ్ ఆడినట్లు తెలిపాడు. మొత్తం మీద ముగ్గురు ఎస్‌బీఐ ఖాతాల నుంచి రూ.72 లక్షల 23 వేల రూపాయల నగదును బదిలీ చేయడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, కాకి లక్ష్మీనారాయణను, మన్నేరు హరికృష్ణను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

## ఎర్రచందనం దుంగల స్వాధీనం



దుంగలు, నిందితుడితో అటవీ అధికారులు

**పీలేరు :** మూడు వాహనాలతో సహా రూ.22 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఓ నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎఫ్ఆర్‌వో వెంకటరమణ తెలిపారు. వివరాలిలా వున్నాయి. ముందుగా అందిన రహస్య సమాచారం మేరకు మల్లెల క్రాస్ వద్ద అటవీ సిబ్బంది ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి సమయంలో కారు, ఎస్కార్టుగా వచ్చిన పల్సర్ బైక్‌లను ఆపేందుకు ప్రయత్నించారు. అయితే దుండగులు వాహనాలు ఆపకుండా కొంత దూరం ముందుకు వెళ్లి రోడ్డు పక్కన ఆపి పరారయ్యారు. కారును పరిశీలించగా అందులో ఏడు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే శుక్రవారం తెల్లవారుజామున పూతలపట్టు మండలం తేనేపల్లె టోల్‌ప్లాజా వద్ద వాహనాలు పరిశీలిస్తుండగా.. వచ్చిన కారును ఆపేందుకు ప్రయత్నించారు. దీంతో కారులో ఉన్న ఒకరు పరారు కాగా, రెండో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని పరిశీలించగా ఎనిమిది ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితుడు తమిళనాడుకు చెందిన నటరాజన్‌గా గుర్తించినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు. ఈ దాడిలో అటవీ శాఖ సిబ్బంది ప్రతాప్, కుమారస్వామి, ప్రభుతేజ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

**ఇద్దరు అరెస్ట్**

**సుండుపల్లె (వీరబల్లి) :** సానిపాయి రేంజ్ రాయవరం సెక్షన్ టీ సుండుపల్లె బీటు పరిధిలోని మాదిగోని బావి రస్తా దగ్గర అటవీ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. అక్రమ రవాణాకు కారులో సిద్ధంగా ఉంచిన 199 కేజీల బరువు గల 6 ఎర్రచందనం దుంగలతోపాటు కారు స్వాధీనం చేసుకున్నారు. వాటికి సంబంధించి తమిళనాడులోని వేలూరు జిల్లాకు చెందిన పేరుమాల్ దేవన్, శశికుమార్ రామ్మూర్తిని అరెస్టు చేశారు. వాహనాన్ని సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పట్టుకున్న దుంగల విలువ రూ.88537 ఉంటుంది. ఈ తనిఖీలలో ఎఫ్ఆర్ఓ పీరయ్య, డీఆర్ఓఎఫ్ రమేష్ బాబు, ఎఫ్‌బీఓలు బీ లక్ష్మీప్రసన్న, ఎ అంజనా స్వాతీ, పి లీలాశ్రీహరి, టి సాయి కృష్ణ, బేస్ క్యాంప్, స్ట్రైక్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు

– అగ్ని ప్రమాదంలో నగదు, ధాన్యం, బీరువా, వస్తువులు దగ్ధం

**లక్కిరెడ్డిపల్లి :** మండలంలోని మద్దిరేవుల గ్రామం బిల్డింగ్ దళితవాడకు చెందిన కత్తి శంకరయ్య గృహంలో శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఫ్రిజ్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో.. ఇల్లంతా మంటలు చెలరేగాయి. దీంతో ధనం, ధాన్యం, దుస్తులు, వస్తువులు కాలిపోయాయని కుటుంబ సభ్యులు వాపోయారు. గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అలాగే అగ్నిమాపక శాఖకు సమాచారం చేరవేశారు. లక్కిరెడ్డిపల్లి నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పడంతో ప్రమాదం నుంచి బయటపడ్డామని బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ, వీఆర్‌ఓ ప్రసాద్, సెక్రటరీ శివయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. జరిగిన నష్టం నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని వీఆర్‌ఓ ప్రసాద్ తెలిపారు.

### మహిళపై దాడి

**మదనపల్లె :** చిన్నపాటి వివాదం కారణంగా పక్కింటి వ్యక్తులు ఓ మహిళపై దాడి చేసిన సంఘటన మదనపల్లె మండలంలో గురువారం రాత్రి జరిగింది. మొలకలదిన్నెకు చెందిన వెంకటేష్ భార్య సుశీల(25) ఇంటి వద్ద కుక్కను కట్టేసి ఉండగా, దారి వెంట వచ్చే జనాలను చూసి అది గట్టిగా మొరగసాగింది. ఈక్రమంలో పక్కింటికి చెందిన రవి ఇంటికి వెళుతుండగా అతడిని చూసి మొరగడంతో.. కుక్కను రాయితో కొట్టేందుకు ప్రయత్నించాడు. ఇది గమనించిన సుశీల అతడితో ఘర్షణకు దిగింది. వారి మధ్య మాటకుమాట పెరిగి గొడవ జరిగింది. రవి రాయితో మహిళను కొట్టాడు. దీంతో బాధితురాలు తీవ్రంగా గాయపడింది. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య

**జమ్మలమడుగు రూరల్ :** జమ్మలమడుగులోని లక్ష్మమ్మ చేను వీధికి చెందిన కంచం వైష్ణవి (22) అనే యువతి శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. సీఐ సదా శివయ్య ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్షుమ్మ చేను వీధికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రవికుమార్‌కు బంధువుల అమ్మాయి కంచం వైష్ణవితో మూడేళ్ల క్రిందట వివాహం జరిగింది. ఇటీవల 4 నెలల క్రిందట వీరికి కూతురు జన్మించింది. సాయంత్రం భర్త రవికుమార్ ఇంటి పై అంతస్తులో కూర్చొని కంప్యూటర్‌లో పని చేసుకుంటున్నాడు. అత్త ఇంటి దినుసుల కోసం కిరణా కొట్టుకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. సుమారు గంటన్నర తరువాత ఇంటికి వచ్చి అత్త చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే కుమారుడు రవికుమార్‌ను కిందికి పిలిచింది. వారు బాధితురాలిని కిందికి దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తమ కూతురు మరణంపై ఎటువంటి అనుమానాలు లేవని తండ్రి చలపతి తెలిపారు. అయితే అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లుగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### నర్సింగ్ సూపరింటెండెంట్ ఇంట్లో చోరీ


**ప్రొద్దుటూరు క్రైం :** స్థానిక రామేశ్వరం రోడ్డులోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న నర్సింగ్ సూపరింటెండెంట్ రాణమ్మ ఇంట్లో చోరీ జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. రాణమ్మ ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం ఉదయం విధులకు వెళ్లిన ఆమె మధ్యాహ్నం ఇంటికి రాగా అప్పటికే తలుపులు తెరచి ఉన్నాయి. బీరువా తలుపులు కూడా తెరవబడి, అందులో ఉన్న వస్తువులన్నీ చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. తర్వాత పరిశీలించగా బీరువాలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు నగలతోపాటు రూ.40 వేల నగదు కనిపించలేదు. ఇంట్లో దొంగలు పడ్డారని భావించిన ఆమె రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు.

### పోగొట్టుకున్న నగదు అప్పగింత

**ప్రొద్దుటూరు క్రైం :** పట్టణానికి చెందిన పార్వతి తమ వీధిలోని మహిళలతో కలిసి వస్త్రాలు కొనుగోలు చేసేందుకు శుక్రవారం సాయంత్రం వస్త్రభారతికి వెళ్లింది. ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కి కొర్రపాడు రోడ్డులోని వివేకానంద క్లాత్ మార్కెట్ వద్ద దిగింది. తర్వాత చూసుకోగా హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదు. హ్యాండ్ బ్యాగ్‌లో రూ.50 వేలు డబ్బు ఉన్నాయని ఆమె తెలిపింది. దీంతో వెంటనే టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూటౌన్ ఇబ్రహీం వెంటనే స్పందించి కానిస్టేబుల్ బాబును పంపించారు. ఆటోను గుర్తించి అందులోని రూ. 50 వేలు ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను ఆమెకు అప్పగించారు. పార్వతి టూ టౌన్ సీఐ ఇబ్రహీం, కానిస్టేబుల్ బాబుకు కృతజ్ఞతలు తెలిపింది.

## ఉద్యోగాలు ఇప్పిస్తామని టోకరా

- ఉడాయించిన టీడీపీ మాజీ సర్పంచ్
- కేసు నమోదు



**చాపాడు :** మండలంలోని టీఓపల్లెకు చెందిన టీడీపీ మాజీ సర్పంచ్, ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి గిద్దలూరు సుబ్బరాయుడు, ఆయన కుమారుడు సుమేష్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నిరుద్యోగుల నుంచి లక్షలు వసూలు చేసి ఉడాయించిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వారు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఆరుగురు నిరుద్యోగ యువతీయువకుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల నుంచి లక్షకు పైగా వసూలు చేశారు. మొత్తం రూ.7.30 లక్షలు రాబట్టుకుని పత్తా లేకుండా పోయారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం నక్కలవాండ్లపల్లె గ్రామానికి చెందిన పెట్ల శివనందిని ఫిర్యాదు మేరకూ శుక్రవారం టీడీపీ మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, అతని కుమారుడు సుమేష్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేసీ రాజు తెలిపారు. సుబ్బరాయుడు డబ్బులు వసూలు చేసిన వారిలో శివనందినితోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన సుధాకర్, మౌనిక, పవన్‌కుమార్, సింధు, ఇందిరా ఉన్నారు. వీరందరూ కలసి తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరుతున్నారు.

## పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయంలో నిరసన

**కడప అగ్రికల్చర్ :** బహుళార్థ పశువైద్యశాలలో(వీపీసీ) డీడీగా పని చేస్తున్న అచ్చెన్నపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పశుసంవర్థశాఖ అధికారుల సేవా సంఘం, పశువైద్యుల సేవా సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా పశుసంవర్థశాఖ జేడీ కార్యాలయంలోని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి శారదమ్మ చాంబర్‌లో జిల్లాలోని పలువురు డీడీ, ఏడీలు, పశువైద్యాధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డీడీ అచ్చెన్నపై చర్యలు తీసుకోవడంతోపాటు ఆయనకు ఉన్న డ్రాయింగ్ పవర్స్‌ను తొలగించడం, వీసీపీలో ఏడీలు, పశువైద్యాధికారితోపాటు అటెండర్లకు ఆపేసిన జీతాలను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. తాము విధులకు డీడీ అచ్చెన్న ఆటంకం కలిగించడంతోపాటు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై నిజ నిర్ధారణ కమిటీ, విచారణ కమిటీ విచారణ చేపట్టి చాలా రోజులు అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇందుకు తాము శని, ఆదివారాలు సహాయక నిరాకరణను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమానికి దూరంగా ఉండటంతోపాటు రిపోర్ట్స్ ఏవీ సబ్‌మిట్ చేయబోమన్నారు. అత్యవసర చికిత్సలకు తప్ప మిగతా వాటికి వైద్య సేవలందించబోమని తెలిపారు. ఈ విషయమై జేడీ(జిల్లా పశుసంవర్థశాఖ అధికారి) శారదమ్మతోపాటు యూనియన్ నాయకులు పశుసంవర్ధశాఖ రాష్ట్ర డైరెక్టర్ అమరేంద్రకుమార్‌కు ఫోన్‌లో సమస్యను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యుల సేవా సంఘం జిల్లా నాయకులు శివరామిరెడ్డి, లక్ష్మీనరసయ్య, గురివిరెడ్డి, పసుసంవర్థశాఖ అధికారుల సేవా సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.